స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ కోర్సులో ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజినీరింగ్ కాలేజీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఈ నెల 15న ప్రారంభమై సాయంత్రం 5.30 నుంచి 7 గంటల వరకు కొనసాగనున్న ఏ–సర్టిఫికెట్ కోర్సెస్ ఇన్ ఇంగ్లిష్ కమ్యూనికేషన్ స్కిల్స్ అండ్ పర్సనాల్టీ డెవలప్‌మెంట్‌లో ప్రవేశానికి 14 వరకు దరఖాస్తు చేసుకోవాలని సెల్ట్ డైరెక్టర్ ప్రొ.సవీన్ తెలిపారు. పూర్తి వివరాలకు 7989903001 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ముస్తాబవుతున్న అథ్లెటిక్ సింథటిక్స్ ట్రాక్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఏ– గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్న అథ్లెటిక్ సింథటిక్స్ ట్రాక్ ప్రారంభానికి ముస్తాబవుతోంది. ఖేలో ఇండియా పథకంలో భాగంగా కేంద్రం విడుదల చేసిన రూ.13 కోట్ల నిధుల్లో రూ.5.5 కోట్లతో నాలుగు వందల మీటర్లతో నిర్మిస్తున్న సింథటిక్ ట్రాక్ తుది మెరుగులు దిద్దుకుంటుంది. వచ్చేనెల చివరి వారంలో ప్రారంభించనున్నట్లు ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ ప్రొ.రాజేష్‌కుమార్ తెలిపారు.

విస్తరణ కాకపాయే .. ట్రాఫిక్ జామాయే!

- ఎనిమిదేళ్లుగా కొనసాగుతున్న లాలాపేట రహదారి విస్తరణ పనులు
- ఉదయం, సాయంత్రం స్తంభిస్తున్న వాహనాలు
- ఇక్కట్లు పడుతున్న విద్యార్థులు, ఉద్యోగులు
- విస్మరిస్తున్న అధికారులు

లాలాపేట: తార్నాక డివిజన్ లాలాపేట ప్రధాన రహదారిలో గత దశాబ్దకాలంగా నెలకొన్న ట్రాఫిక్ సమస్య నేటికీ పరిష్కారం కావడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే గతంలో ఈ సమస్యకు చెక్ పెట్టాలనే ఉద్దేశంతో చేపట్టిన లాలాపేట ప్రధాన రహదారి విస్తరణ పనులు ఓ అడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్న చందంగా తయారైంది. దాదాపుగా 8 ఏళ్ల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. రోడ్డు విస్తరణ పనులు చేపట్టాక ఒక సారి ఎమ్మెల్యే ఎన్నికలు, మరోసారి జీహెచ్‌ఎంసీ ఎన్నికలు వచ్చాయి. తాజాగా మళ్లీ ఎమ్మెల్యే ఎన్నికలు వచ్చాయి కానీ లాలాపేట రోడ్డు విస్తరణ మాత్రం పూర్తి కాలేదు. ఇలా మూడు పర్యాయాలు ఎన్నికల కోడ్‌తో పనులకు ఆంతరాయం ఏర్పడగా విస్తరణ చేపట్టిన నాటి నుంచి దాదాపు ఐదు మంది అధికారులు సైతం వచ్చి వెళ్లారు. రోడ్డుకు ఇరువైపుల వంద సంఖ్యలో నిర్మాణాలను తొలగించినప్పటికీ రోడ్డు మధ్యలోకి వచ్చిన విద్యుత్ స్తంభాలను తొలగించలేదు. రోడ్డు నిర్మాణం చేయకపోవడంతో రోడ్డు విస్తరణ చేసినట్లే లేదు. ఎక్కడ ఉన్న ట్రాఫిక్ సమస్య అక్కడే ఉంది. వాహనాల రద్దీతో మరింతగా పెరిగిందనే చెప్పాలి. ట్రాఫిక్ నియంత్రణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో లాలాపేట వాసులు రోడ్డు దాటాలంటే చాలా కష్టతరంగా మారింది. ఉదయం, సాయంత్రం ఇటు అంబేడ్కర్ విగ్రహం నుంచి అటు పూలే విగ్రహం వరకు భారీగా ట్రాఫిక్ స్తంభించిపోతోంది.



నడిరోడ్డులో ఏర్పాటు చేసిన వారాంతపు సంత

సంతతో మరీ ఇబ్బంది..

తార్నాక డివిజన్ లాలాపేట ప్రధాన రహదారిలో ఇప్పటికే ట్రాఫిక్ సమస్యతో ఈ ప్రాంత వాసులు సతమతం అవుతూ ఉంటే దీనికి తోడుగా ప్రతి మంగళవారం నిర్వహిస్తున్న వారాంతపు సంత సమస్యను మరింత జఠిలం చేస్తుందని స్థానికులు వాపోతున్నారు. రోడ్డు విస్తరణ పూర్తయ్యే వరకు ఈ ప్రాంతంలో నిర్వహిస్తున్న వారాంతపు సంతను బంద్ చేయాలని స్థానికులు కోరుతున్నారు. సంత జరిగే రోజు లాలాపేట అంబేడ్కర్ విగ్రహం నుంచి పూలే విగ్రహం వరకు అడుగుతీసి అడుగు పెట్టలేని పరిస్థితి ఉంటుంది. ఒక వైపు వాహనాల రద్దీకి తోడుగా సంతలో రోడ్డుపై వరకు ఏర్పాటు చేసే దుకాణాలు వాటి వద్దకు వచ్చే కొనుగోలుదారులతో కిక్కిరిపోతోంది.

అంబులెన్స్‌కూ దారి లేకుండా..

లాలాపేటలో ఉన్న ప్రభుత్వ ప్రసూతి కేంద్రం (మెటర్నిటీ హాస్పిటల్‌)కు నిత్యం వచ్చి వెళ్లే అంబులెన్స్‌లకు ట్రాఫిక్‌తో తీవ్ర ఆంతరాయం ఏర్పడుతుందన్నారు. పలు సందర్భాల్లో అంబులెన్స్ వాహనం ట్రాఫిక్‌లో చిక్కుకున్న సందర్భాలు ఉన్నాయన్నారు. దీంతో ఉదయం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, కార్యాలయాలకు వెళ్లే ఉద్యోగులు, వివిధ పనుల కోసం వెళ్లే వారు నానా ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు సైతం ఏదైనా అవసరం నిమిత్తం రోడ్డుపై రావాలంటే రాలేకపోతున్నారు. వాహనాల రద్దీతో రోడ్డు దాటలేని పరిస్థితి ఉంటుంది. లాలాపేట ప్రధాన రహదారిలో నిర్వహిస్తున్న సంతను వేరే ప్రాంతానికి తరలించి, ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలనీ లాలాపేట వాసులు కోరుతున్నారు.



లాలాపేట ప్రధాన రహదారిలో సాయంత్రం వేళలో వాహనాల రద్దీ(ఫైల్)

వెన్నెలకు ప్రజాసంఘాల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న పాశం యాదగిరి

కంటోన్మెంట్: ప్రజా యుద్ధనౌక, దివంగత గాయకుడు గద్దర్ కుమార్తె వెన్నెలకు తెలంగాణ వ్యాప్తంగా పలు ప్రజా సంఘాలు మద్దతుగా నిలుస్తున్నాయని ప్రముఖ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమకారుడు పాశం యాదగిరి పేర్కొన్నారు. ఈ మేరకు 31 ప్రజాసంఘా ల ప్రతినిధులతో కలిసి మడ్‌ఫోర్ట్‌లోని కాంగ్రెస్ ఎన్నికల కార్యాలయంలోని విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమ ద్రోహులకు కొమ్ముకాస్తున్న కేసీఆర్‌ను గద్దె దించడమే లక్ష్యంగా తమ ప్రజా సంఘాలు అన్ని రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తాయన్నారు. ప్రస్తు తం తెలంగాణ దొంగలపాలైందని ఆరోపించారు. కంటోన్మెంట్‌లోని 60 వేల పైచిలుకు ఇళ్లకు వెళ్లి, గజ్జె కట్టి మరీ పాడుతూ వెన్నెల గెలుపునకు కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో కరుణాకర్ దేశాయ్, ఎస్ యాదగిరి, కృష్ణా రెడ్డి, పీఎన్ మూర్తి, రామగిరి ప్రకాశ్, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా ప్రతినిధి మహేశ్ బాబు, నాగేశ్, మల్లారెడ్డి పాల్గొన్నారు.

బొల్లారంలో ఎన్నికల ప్రచారం



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న గజ్జెల నాగేష్, లోక్‌నాథ్

రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారంలో వేగం పెంచింది. ఇప్పటివరకు పార్టీ అభ్యర్థి లాస్య నందిత మొదటి విడత ఇంటింటికి తిరిగి ప్రచారం ముగించగా ఆమెకు మద్దతుగా సీనియర్ నాయకులు, బోర్డు మాజీ సభ్యులు ప్రచారాన్ని కొనసాగిస్తున్నారు. బుధవారం బొల్లారంలోని పలు బస్తీల్లో గజ్జెల నాగేష్, లోక్‌నాథ్ ఇంటింటికి తిరిగి బీఆర్‌ఎస్ మేనిఫెస్టో కరపత్రాలను పంచారు. ప్రచారంలో వేణుగోపాల్ రెడ్డి, ఖదీరవన్, శంకర్‌సింగ్, బాల్‌రాజ్, పాండురంగారావు, శ్రీను, చంద్రకుమార్, ప్రవీణ్, రవి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి



బీఆర్‌ఎస్‌లో చేరిన యువకులతో మంత్రి తలసాని

సనత్‌నగర్: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుతో ప్రజల మనస్సును గెలుచుకున్న పార్టీ బీఆర్‌ఎస్ అని సనత్‌నగర్ అభ్యర్థి, మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద పలువురు మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. మంత్రి మాట్లాడుతూ.. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ అభ్యర్థులను గెలిపిస్తాయని దేశంలో ఎక్కడా లేనివిధంగా సీఎం కేసీఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ దేశానికే ఆదర్శంగా తెలంగాణ రాష్ట్రం నిలిచిందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు ఆకర్షితులై అనేక మంది బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారన్నారు. బేగంపేటకు చెందిన నాని ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు అన్వర్, హమీద్, ఫయాజ్, రఘు, బన్సీలాల్‌పేటకు చెందిన మనీష్ ఆధ్వర్యంలో సాయినాథ్, సుభానీ, సాయి సాగర్, కృష్ణ బీఆర్‌ఎస్‌లో చేరారు.



నామినేషన్ పత్రాలు అందజేస్తున్న పద్మారావుగౌడ్



కాంగ్రెస్ నుంచి ఆదం సంతోష్ నామినేషన్

నామినేషన్ల దాఖలు

సనత్‌నగర్: ప్రధాన పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్ అభ్యర్థులు బుధవారం నామినేషన్లు దాఖలు చేశారు. బీజేపీ నుంచి మర్రి శశిధర్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కోట నీలిమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. నియోజకవర్గానికి చెందిన బీజేపీ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరాగా నామినేషన్ వేసేందుకు మర్రి శశిధర్‌రెడ్డి ర్యాలీగా బయలుదేరారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కోట నీలిమ తరుపున ఆమె భర్త పవన్ ఖేరా నామినేషన్ దాఖలు చేశారు. ఆమె మరో సెట్ నామినేషన్‌ను ఈ నెల 10న సమర్పించనున్నారు. వీరే కాకుండా బుధవారం జై మహా భారత్ పార్టీ తరుపున సుజాత నామినేషన్ వేశారు. దీంతో ఇప్పటి వరకు ఆరుగురు నుంచి తొమ్మిది సెట్ల నామినేషన్లను స్వీకరించడం జరిగిందని ఆర్వో కిషన్‌రావు తెలిపారు.

కంటోన్మెంట్‌లో ..

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గంలో బుధవారం నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. మొత్తంగా ఇప్పటి వరకు తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. బీఆర్‌ఎస్ తరపున లాస్య నందిత రెండు సెట్ల నామినేషన్లు వేశారు. కొత్తగా బి. రవికుమార్ ఇండిపెండెంట్‌గా వేయగా, తొలి రోజు నామినేషన్ వేసిన శ్రమజీవి పార్టీ అభ్యర్థి జాజుల భాస్కర్ మరో సెట్ నామినేషన్ దాఖలు చేశారు. లాస్య నందిత వెంట ఆమె తల్లి గీత సాయన్న ఉన్నారు.

సికింద్రాబాద్‌లో నుంచి..

సికింద్రాబాద్: సికింద్రాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ కోసం బుధవారం ఏడుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్, కాంగ్రెస్ అభ్యర్థి ఆదం సంతోష్‌కుమార్ తలా రెండు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి కనుగంటి రాజు, విద్యార్థుల రాజకీయ పార్టీ నుంచి పి.నవీన్‌బాబు, ఆమ్‌ఆద్మీ నుంచి మహ్మద్ అఫ్జల్, జనరాజ్యం నుంచి వేణు, స్వతంత్ర అభ్యర్థిగా తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్ నామినేషన్లు దాఖలు చేసినట్టు రిటర్నింగ్ అధికారి ఎస్.ఎల్లారెడ్డి తెలిపారు.



నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న లాస్య నందిత



నామినేషన్ దాఖలు చేస్తున్న మర్రి శశిధర్‌రెడ్డి

16న దివ్యాంగుల మహాధర్నా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఈ నెల 16వ తేదీన నిర్వహించే చలో ముంబయి దివ్యాంగుల మహాధర్నాను జయప్రదం చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, రాష్ట్ర నాయకులు వి.భారతి, కాటమోని వెంకటేష్‌గౌడ్‌లు తెలిపారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... దివ్యాంగులకు రూ. 10 వేల పెన్షన్, నిరుద్యోగ భృతి రూ. 4 వేలు ఇవ్వాలని, చట్టసభల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో పాటు మరో 20 డిమాండ్లతో కూడిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముంబయిలో మహాధర్నా నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

హోర్డింగ్ టెండర్‌ను రద్దు చేయాలి

కంటోన్మెంట్: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో కంటోన్మెంట్ పరిధిలో హోర్డింగ్ టెండర్‌ను రద్దు చేయాలని తెలంగాణ ఔట్‌డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేస్తూ కంటోన్మెంట్ సీఈఓకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అమలవుతున్న నేపథ్యంలో హోర్డింగ్‌ల ఏర్పాటుపై కూడా ఆంక్షలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. టెండరు ప్రకటన విషయంలో తగిన ప్రచారమే లేదన్నారు. కంటోన్మెంట్ నూతన వెబ్‌సైట్ పట్ల అవగాహన లేని పలు ఏజెన్సీలకు టెండర్ల విషయమే తెలియలేదన్నారు. ఎన్నికల సమయంలో టెండర్ వేయడం వల్ల కూడా ప్రతికూల ప్రభావం చూపుతుందన్నారు. దీంతో పాత టెండర్‌ను రద్దు చేసి, మరోసారి హోర్డింగ్‌ల కోసం టెండర్ పిలవాలని కోరుతున్నామన్నారు.



మాట్లాడుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

సికింద్రాబాద్ టికెట్‌పై పునరాలోచించాలి



మాట్లాడుతున్న బండపెల్లి సతీష్

సికింద్రాబాద్: పదేళ్లుగా పార్టీలో ఉంటూ నిబద్ధతతో ప్రజా సమస్యల పరిష్కారం, పార్టీ అభివృద్ధి కోసం పనిచేస్తున్న తనకు టికెట్ ఇవ్వకుండా తమ పార్టీ నాయకులు తప్పు చేశారని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు బండపెల్లి సతీష్ పేర్కొన్నారు. సీతాఫల్‌మండిలోని బీజేపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను గత అసెంబ్లీ ఎన్నికల్లో సికింద్రాబాద్ నుంచి బరిలో దిగే వరకు పార్టీకి కేడర్ లేదన్నారు. తాను ఓటమి పాలైనప్పటికీ పార్టీని బలోపేతం చేయడం కోసం నిరంతరంగా కృషి చేస్తున్నానని చెప్పారు. ప్రస్తుతం పార్టీ బలోపేతం అయ్యాక ఇతర పార్టీల నుంచి వచ్చిన వ్యక్తులకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడంతో తీవ్రంగా మనస్తాపానికి గురయ్యామన్నారు. తనకన్నా సమర్థులకు టికెట్ ఇస్తే ఎలాంటి అభ్యంతరం లేదని, పలుమార్లు ఓటమి పాలై పార్టీలు మారిన వ్యక్తులకు టికెట్ ఇవ్వడం సరికాదన్నారు.

దళితుల అభ్యున్నతి ప్రణాళికలు మేనిఫెస్టోలో చేర్చాలి

అడ్డగుట్ట: దళితుల సమగ్రాభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తామని రాజకీయ పార్టీలు ఎన్నికల మేనిఫెస్టోలలో చేర్చాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి, సోషల్ డెమోక్రటిక్ ఫోరం రాష్ట్ర కన్వీనర్ ఆకునూరి మురళి డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు డీబీఎఫ్ రూపొందించిన దళిత్ మేనిఫెస్టోను బుధవారం ఆయన సికింద్రాబాద్‌లో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యను అందించడంలో పాలకులు విఫలమయ్యారని విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలని బడ్జెట్‌లో విద్యకు 12 శాతం నిధులు కేటాయించి ప్రతీ మండలానికి అంతర్జాతీయ ప్రమాణాలతో గురుకుల విద్యాలయాలను నిర్మించాలన్నారు. హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయం ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. కుల వ్యవస్థ నిర్మూలనకు నిర్దిష్ట ప్రతిపాదనలు రాజకీయ పార్టీలు చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టాన్ని సక్రమంగా అమలు చేసి దళితులపై దాడులను నిరోధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ పద్మజ, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన, తెలంగాణ ప్రజాస్వామ్య వేదిక నాయకులు గోవర్ధన్ పాల్గొన్నారు.

‘పైరవీలతోనే పార్ట్‌టైం అధ్యాపకుల ఉద్యోగాలు’

ఉస్మానియా యూనివర్సిటీ: నింబంధనలను ఉల్లంఘించి పైరవీలు చేసే వారికే ఓయూ పార్ట్‌టైం అధ్యాపక ఉద్యోగాలు లభిస్తున్నాయని డాక్టర్ జ్యోతిపద్మజా ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై గత నాలుగు రోజులుగా భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న ఆమె నియామకాలపై అనేక ఆరోపణలు చేశారు. ఇటీవల ఓయూ కెమిస్ట్రీ విభాగంలో జరిగిన పార్టుటైం అధ్యాపకుల నియామకాలలో అక్రమాలు జరిగాయన్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో ఇంటర్వ్యూ సమయంలో తనను అవమాన పరిచేలా ప్రొఫెసర్లు నవ్వుకున్నారని జ్యోతిపద్మజా ఆరోపించారు. గోల్డ్‌మెడల్స్, పీహెచ్‌డీ, బోధన అనుభవం గల అభ్యర్థులను విస్మరించి రాత పరీక్ష, ఇంటర్వ్యూలకు హాజరు కాకున్నా కేవలం పైరవీలు చేసిన వారినే ఉద్యోగాలలో నియమించారన్నారు. ఉద్యోగాల భర్తీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు.

బీఆర్‌ఎస్‌కు గుణపాఠం తప్పదు





ఎన్నికల ప్రచారంలో బండి రమేష్

సనత్‌నగర్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారెంటీ పథకాలను తప్పకుండా అమలు చేసి అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా చూస్తుందని ఆ పార్టీ కూకట్‌పల్లి నియోజకవర్గ అభ్యర్థి బండి రమేష్ అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బేగంపేట డివిజన్ మయూరిమార్గ్, అల్లంతోట బావి ప్రాంతాల్లో పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొత్త రేషన్ కార్డుల ఊసే లేదన్నారు. పథకాల విషయంలో కల్లబొల్లి హామీలను ఇస్తూ ప్రజలను మోసం చేస్తుందన్నారు. అవినీతి బీఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేందుకు ప్రజలందరు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల సంక్షేమం కోసం పథకాలను సమర్థవంతంగా అమలు చేయడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు గౌరపల్లి రమేష్, హోసి, రమాదేవి, రాధా, విజయ్ కుమార్, శ్రీనివాస్, కిష్టరెడ్డి, సాంయ్యా, సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రంలో బీజేపీకి అంత సీన్ లేదు

అంబర్‌పేట: రెండు సీట్లు గెలువని భారతీయ జనతా పార్టీ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతోందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. బుధవారం బాగ్ అంబర్‌పేటలో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌కు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం పాల్గొన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడే బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేయాలని మంత్రి ఓటర్లను కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి అంబర్‌పేట అడ్డా అని ప్రచారం చేసుకునే అతను ఇప్పుడు ఎక్కడ ఉన్నాడని తలసాని ఎద్దేవా చేశారు. కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు ఒక లక్ష రూపాయాలు కూడ ఖర్చుచేయలేదని తలసాని విమర్శించారు.

భవన నిర్మాణ కార్మికులకు ఇన్సూరెన్స్ కార్డుల అందజేత



చిలకలగూడ: భవన నిర్మాణ రంగ కార్మిక కుటుంబాలకు ఇన్సూరెన్స్ కార్డులు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని సీఐటీయూ సికింద్రాబాద్ జోన్ కార్యదర్శి మహేందర్ అన్నారు. చిలకలగూడ లేబర్‌అడ్డా వద్ద బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు కార్మికులకు తీవ్ర అన్యాయం చేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. మతోన్మాద, అవినీతి రాజకీయాలకు పాల్పడుతున్న ఆయా పార్టీలను రానున్న ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. నిత్యవసర సరుకుల ధరలు నానాటికీ పెరుగుతున్నా కనీస వేతనాలు రూ.26 వేలు చెల్లించేందుకు అంగీకరించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం పలువురు భవన నిర్మాణ కార్మికులకు ఇన్సూరెన్స్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మధు, ఎల్లస్వామి, పాషా, కృష్ణ, రాజు, రవి, కృష్ణమూర్తి పాల్గొన్నారు.



పొదుపు సంఘాలపై ఫోకస్!

- సంఘం ఉంటే ప్యాకేజీ పక్కా
- కులాలకు ప్రత్యేక ప్రాధాన్యం
- లష్కర్‌లో అన్ని సంఘాలు కలిపి 2 వేల మంది మహిళలు

సికింద్రాబాద్: ఎన్నికలు వచ్చాయంటే చాలు ఎప్పుడు కనబడని సంఘాలు ప్రాచుర్యంలోకి వస్తాయి. అంతేకాదు ఇదే సమయంలో కుల, యువజన, మహిళా సంఘాలకు ఉన్న పలంగా ప్రాధాన్యం వస్తోంది. త్వరలో జరగనున్న ఎన్నికల సందర్భంలోనూ లష్కర్‌లో అదే జరుగుతుంది. నిన్న మొన్నటి వరకు సంఘాలకు అంతగా ప్రాధాన్యం ఇవ్వని నేతలంతా ఒక్కసారిగా ప్రేమాభిమానాలు కురిపిస్తున్నారు. ఆయా సంఘాల ప్రతినిధులను మచ్చిక చేసుకునేందుకు‘పోటీ పడుతున్నారు. సంఘాలకు భవనం నిర్మించుకోవడం, సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాల పేరిట నజరాలు పొందడం కోసం ఇదే సరైన సమయంగా ఆయా సంఘాల నిర్వాహకులు భావిస్తున్నారు.

పుట్టుకొస్తున్న సంఘాలు..

తమ సమస్యలు చెప్పుకోవడానికి, ఇందుకోసం నాయకుల ద్వారా అవసరమైన సహాయాలు, హామీలు పొందడం కోసం ఇదే సరైన సమయంగా భావిస్తున్నారు. ఎన్నికల తేదీ దగ్గర పడుతున్న తరుణంలో మూలన పడుతున్న సంఘాలకు కూడా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇదిలా ఉండగా మూలపడిన సంఘాలు, చెల్లాచెదురైన సభ్యులను కూడా ఎన్నికల సందర్భంగా రాజకీయపార్టీల నాయకులు నిద్రలేపుతున్నారు. వారిని మళ్లీ ఒక్కటి చేస్తున్నారు. కండువాలు కప్పు ఆ పార్టీల్లో చేర్చుకుంటున్నారు. సంఘాల ప్రతినిధులకు డబ్బులు అందిస్తున్నారు. భవిష్యత్ అవసరాలకు హామీలు ఇస్తున్నారు. శాసనసభ ఎన్నికల పుణ్యామాని సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో సంఘాలకు తాజాగా మరోమారు విపరీతమైన రాజకీయ ప్రాధాన్యం లభిస్తుంది.

చేర్చుకునేందుకు కసరత్తులు

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సికింద్రాబాద్‌లో మహిళా పొదుపు సంఘాలకు సైతం రాజకీయ ప్రాధాన్యం పెరిగింది. ఎన్నికల సందర్భాల్లో సాధారణంగా రాజకీయ పార్టీలు బూత్‌ల వారీగా కమిటీలు ఏర్పాటు చేసి వారికి నజరానాలు అందిస్తారు. పొదుపు సంఘాలకు ప్రాధాన్యత పెరగడంతో రాజకీయ పార్టీల నాయకులు మహిళా సంఘాల ప్రతినిధులతో కూడా ప్రత్యేక బూత్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. సంఘాల సభ్యులందరికీ నగదు నజనారాలు అందిస్తున్నారు. నియోజకవర్గంలో అన్ని పొదుపు సంఘాల్లో మొత్తంగా 2 వేల వరకు మహిళలు ఉన్నారు. వీరందకీ రాజకీయ సహాయం చేసి ఓట్లను పొందేందుకు కసరత్తులు చేస్తున్నారు.

జట్టుగా ఉంటే బేరసారాలు..

కుల, యువజన, సంక్షేమ, సీనియర్ సిటిజన్ల సంఘం ఏదైనా సరే జట్టుగా పదిమంది ఉంటే చాలు వారి దగ్గరకు అభ్యర్థులు వస్తున్నారు. బేరాలు చేస్తున్నారు. పార్టీలో చేర్చుకుంటున్నారు. తృణమో ఫణమో ముట్టజెప్పుతున్నారు. తమకు ఓట్లు వేయించాల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. మహిళలు, విద్యార్థులు, యువకులే కాకుండా పలువురు వృద్ధులూ ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనేందుకు ముందుకు వస్తున్నారు. జెండా పట్టుకుని, కండువాలు ధరించి పాదయాత్రలు, ర్యాలీల్లో పాల్గొంటున్నారు. బూత్‌కమిటీల్లో స్థానం సంపాదించి అంతర్గత ప్రచారాలకు సమాయత్తం అవుతున్నారు. పోల్ చీటీలు పంచడం, ఎన్నికల గుర్తును ఓటర్లకు తెలపడం వంటి కార్యక్రమాల్లో పాల్గొని నాలుగు డబ్బులు జేబులో వేసుకునేందుకు ఎన్నికల కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు.

కంటోన్మెంట్ కింగ్‌మేకర్ల మద్దతెవరికో?



రసూల్‌పురా: కంటోన్మెంట్ నియోజకవర్గంలో కింగ్ మేకర్లుగా పేరొందిన బోర్డు మాజీ ఉపాధ్యక్షులు సదా కేశవరెడ్డి, జంపన ప్రతాప్‌ల మద్దతు ఏ పార్టీ అభ్యర్థికి ఉందనే ఆసక్తి నెలకొంది. కంటోన్మెంట్‌లో వీరు ఎవరిని కింగ్ చేస్తారు అన్న ప్రశ్న ఉత్కంఠ రేపుతోంది. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి అన్ని రాజకీయ పార్టీల నుంచి టికెట్ ఆశించే అభ్యర్థులు వీరి చుట్టూ ప్రదక్షిణలు చేశారు. బీఆర్‌ఎస్ నుంచి బరిలో ఉన్న లాస్యనందిత తనకు టికెట్ ప్రకటించగానే వీరిని కలిసి మద్దతు కోరారు. మొన్నటి వరకు బీజేపీ నుంచి టికెట్ ఆశించిన సుష్మిత, పరశురాంలు ప్రస్తుతం టికెట్ ఆశిస్తున్న శ్రీగణేష్, కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించిన జీవకన్, నరసింహ కన్నన్ తమకు టికెట్ కోసం ప్రయత్నించాలని చక్కర్లు కొట్టారు. కాగా కాంగ్రెస్ పార్టీ గద్దర్ కుమార్తె వెన్నెలకు టికెట్ కేటాయించడంతో ఆమె సైతం వీరిని కలిసేందుకు ప్రయత్నిస్తున్నారు ఇటీవల కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరి టికెట్ కోసం ఆశిస్తున్న శ్రీగణేష్ సైతం వీరి మద్దతు కోరుతున్నారు. కాగా సదా కేశవరెడ్డి, జంపన ప్రతాప్‌లు ఇరువురు ఇటీవల కంటోన్మెంట్‌లో ఓ ప్రాంతంలో సమావేశం నిర్వహించి ఏ పార్టీ అభ్యర్థికి మద్దతు ఇవ్వాలని సమాలోచనలు చేశారు. బీజేపీ అభ్యర్థిని ప్రకటించిన అనంతరం లిరువురు కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. నిజానికి సదా కేశవరెడ్డి, జంపన ప్రతాప్‌ల మధ్య బేధాభిప్రాయాలు ఉన్నప్పటికి ఓ అభ్యర్థికి మద్దతు ఇవ్వనున్నట్లు సమాచారం. నిన్నటి కన్నా రేపటికి ప్రాధాన్యం ఇస్తూ ఇరువురు కీలక నిర్ణయం తీసుకుంటారని వీరి సన్నిహితులు చెబుతున్నారు.